క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం ప్రోగ్రాం నిర్వహించటం జరుగుతుందని డిపో మేనేజర్ ముక్తేశ్వరరావు అన్నారు. ప్రతి నెల 10వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తెలియజేయాలని ఆయన తెలిపారు.

రైతు భరోసా కేంద్రాల్లో కందులు కొనుగోళ్లు



మాచవరం: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కంది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సేవలు అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల యాప్‌ల ద్వారా ఈ–పంట నమోదు, ఈ కేవైసీ తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. రబీ పంటలకు అవసరమైన ఎరువులు ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అక్టోబర్ తర్వాత పంటలు వేసిన రైతులు ఈ–పంట నమోదు, ఈ కేవైసీ చేయించుకోవాలని తెలియజేశారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారిణి కె.రామమ్మ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చౌదరి సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్, సలహా మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండవీడు కోటను సందర్శించండి



మాచర్ల రూరల్: చరిత్రలో ప్రసిద్ధి చెందిన కొండవీటి కోటను ఆధునీకరించి భావితరాలకు మన చరిత్ర తెలిసేలా పర్యాటకంగా అభివృద్ధి చేసి ప్రభుత్వం కొండవీడు ఫెస్ట్ నిర్వహిస్తుందని ఎంపీడీవో సరోజనీదేవి, మండల పార్టీ నాయకుడు బూడిద శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో కొండవీటి ఫెస్ట్ పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. చరిత్రను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ ఫెస్ట్‌లో హెలికాప్టర్, ప్యారాచూట్, బోటులో తిలకించవచ్చునని, అంతేకాకుండా ఆహ్లాదకరమైన తోటలు, దేవాలయాలున్నాయన్నారు. వీటిని అందరూ సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కోటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ గాదె శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు యెల్లెబోయిన కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు యల్లాల బ్రహ్మయ్య, శ్రీను నాయక్ తదితరులున్నారు.

బ్రహ్మానందపురం తండాలో ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరం ప్రారంభం

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం తమ దత్తత గ్రామమైన మాచర్ల మండలంలోని బ్రహ్మానందపురం తండాలో ఎన్‌ఎస్‌ఎస్ సేవా శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్‌కే మహమ్మద్ బాషా మాట్లాడుతూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ సెల్ కో–ఆర్డినేటర్ రవిశంకర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్‌ఎస్ చౌదరి ఆదేశాల మేరకు ఈ నెల 15 వరకు సేవా శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సేవా శిబిరంలో ఎంపికైన 44 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు 7 రోజుల పాటు గ్రామంలో వివిధ రకాల సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వలంటీర్లకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సాయంత్రం ఇంటింటికి తిరిగి వారి లోటుపాట్లను తెలుసుకున్నారు. వలంటీర్లు గ్రామస్తులతో కలిసి ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీదేవి, ఉపాధ్యాయుడు కాంతారావు, గ్రామస్తులు భీమా, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

మండాది జెడ్పీహెచ్‌ఎస్‌లో వార్షిక ఇన్‌స్పెక్షన్

వెల్దుర్తి: మండలంలోని మండాది జెడ్పీహెచ్‌ఎస్‌లో నరసరావుపేట డిప్యూటీ డీఈవో కె.వెంకట గోపాలరావు ఆధ్వర్యంలో శుక్రవారం వార్షిక ఇన్‌స్పెక్షన్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ కష్టపడి చదివి ప్రతిభను చాటాలన్నారు. త్వరలో జరగబోయే 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు. పరీక్షలు రాసేటప్పుడు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించాలన్నారు. పాఠశాలలో సంవత్సర కాలంలో జరిగిన పనులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలి

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



కృష్ణానది వద్ద అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

మాచవరం: ప్రస్తుతం కృష్ణానదిలో నీటి నిల్వ తగ్గుతున్నందున వేసవిలో పిడుగురాళ్ల పట్టణానికి, మాచవరం మండలంలోని పలు గ్రామాలకు మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. మండలంలోని గోవిందాపురం వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి పంపుహౌస్‌లను అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంచినీటి సరఫరాకు చేపడుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. పైపులైన్ పెంపు, విద్యుత్ సౌకర్యాల ఏర్పాటు, నీటి నిల్వకు చేపట్టాల్సిన పనులపై అధికారులతో చర్చించారు. నదిలో డెడ్ స్టోరేజ్ అయినా, అడ్డుకట్టల ద్వారా నీటి నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మోర్జంపాడు, మాచవరం పాత పంపు హౌస్‌కు విద్యుత్ పునరుద్ధరణకు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డెడ్ స్టోరేజ్ వచ్చినా మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేందుకు పనులకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు అధికారులు ఆయనకు వివరించారు. ఆయన వెంట ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లు, లిఫ్టు ఇరిగేషన్ అధికారులు, పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, జెడ్పీటీసీ శివాయాదవ్, మండల కన్వీనర్ చౌదరి సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, వైస్ ఎంపీపీ చింతపల్లి నన్నేషైదా, జిల్లా కార్యదర్శి జిలుగు వెంకట నరసింహారెడ్డి తదితరులున్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టండి

దాచేపల్లి : భూగర్భ జలాలు ఇంకిపోవటం వలన నీటి సమస్యలు తలెత్తుతున్నాయని, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పొందుగలలో కృష్ణానది వద్ద ఉన్న పంపుహౌస్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. నదిలో నీటి నిల్వలు తగ్గటంతో పంపుహౌస్‌లోని మోటార్లకు నీరు అందటంలేదని, దీని వలన నగర పంచాయతీలోని పలు వార్డుల్లో నీటి సమస్యలు ఉన్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే కాసు దృష్టికి తీసుకెళ్లారు. నదిలో నీటి నిల్వలు పెంచటం కోసం ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. నగర పంచాయతీతో పాటు గ్రామాల్లో నీటి సమస్యలు వస్తే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, నీటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని అధికారులకు సూచించారు. అవసరమైన చోట బోర్లు వేయాలని, బోర్లు పనిచేసే ప్రాంతాల్లో పైపులైన్లు విస్తరించాలని ఆయన చెప్పారు. వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఆయన వెంట నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, డీఈ సత్యనారాయణ, సర్పంచ్ షేక్ ఇమామ్‌వలి, మాజీ సర్పంచ్ తండా బుడేసా, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి, నాయకులు సైదులు, జిలానీ తదితరులున్నారు.

గ్రామాలలోనే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు



శిబిరంలో వైద్యులు వెంకయ్య, ఎంపీపీ చౌడేశ్వరి, మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో శంకర్‌రావు



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ నాగేశ్వరనాయక్



సురక్ష కార్డులు పంపిణీ చేస్తున్న ప్రజా ప్రతినిధులు



రోగికి మందులు రాస్తున్న డాక్టర్ మౌనిక

కారెంపూడి: నివాసం ఉంటున్న చోటే ప్రతి ఒక్కరికి కార్పొరేట్ హాస్పిటల్స్‌లో అందే వైద్య సేవలు అందించాలనేది జగనన్న ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా స్పెషలిస్ట్ డాక్టర్లతో ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారని ఎంపీపీ బొమ్మిన సావిత్రిఅల్లయ్య అన్నారు. మండలంలోని నరమాలపాడు గ్రామంలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ప్రారంభ కార్యక్రమంలో సర్పంచ్ బుర్రి రామగురవయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డితో కలసి పాల్గొన్నారు. గ్రామాలలో ఆనాడు కనీసం జ్వరం మాత్ర దొరకని పరిస్థితి ఉండేదని ప్రస్తుతం బీపీ, షుగర్ మాత్రలు కూడా ఇళ్ల వద్దకే వచ్చి అందిస్తున్న పరిస్థితిని చూస్తున్నామని, సురక్ష క్యాంపుల ద్వారా స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలను కూడా ప్రజలకు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. శిబిరంలో 496 మంది వైద్య సేవలు పొందారు. ఎంఎస్ ఆర్థో డాక్టర్ బి నాగేశ్వరనాయక్, గైనకాలజిస్ట్ డాక్టర్ వై.లక్ష్మి, వైద్యాధికారి డాక్టర్ కె.మౌనిక, ఆప్తాలమిక్ ఆఫీసర్ జి.శ్రీధర్ వైద్య సేవలందించారు. ఎంఎల్‌హెచ్‌పీఎస్, ఏఎన్‌ఎంలు, 104 సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్డులు రాయడంతో పాటు వారికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేశారు. డాక్టర్లకు చూపించుకున్న వారికి మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, ఎంపీటీసీ చేవూరి భవాని, మాజీ ఎంపీటీసీ లక్ష్మీతిరుపతిరావు, ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, సీహెచ్‌వో మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పేద ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష సంజీవని

రెంటచింతల: రాష్ట్రంలోని పేద ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఒక సంజీవని అని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని వెంకటేశ్వర స్వామిమాన్యం కాలనీలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండోదశ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటింటికి ఉచితంగా వైద్య సేవలు, మందులను ఇచ్చే విధంగా అందజేస్తున్నారన్నారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేయడానికి ముందుగా ఆ సచివాలయ పరిధిలోని ప్రతి కుటుంబ ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమలో సర్పంచ్ పేర్ల చౌడమ్మ, ఎంపీడీవో పి.శంకర్‌రావు, మెడికల్ ఆఫీసర్లు బి.ప్రదీప్‌రెడ్డి, సాగరు రాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్ల ముత్తయ్య, ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లా మార్గాన్ని మానవాళికి తెలపాలి

పిడుగురాళ్ల: అల్లా మార్గాన్ని మానవాళికి తెలిసే విధంగా ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు తెలియజేయాలని ఫిస్ మెస్సెజ్ ఫౌండేషన్ ఫౌండర్, ప్రెసిడెంట్ బ్రదర్ సిరాజ్ ఉర్ రెహమాన్ తెలిపారు. పట్టణంలోని సూఫీ మసీదులో శుక్రవారాన్ని పురస్కరించుకొని చదువుని ప్రభు పేరుతో అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా బ్రదర్ సిరాజ్ ఉర్ రెహమాన్ మాట్లాడుతూ అల్లా అంటే ప్రతి ఒక్కరు కలిసి మెలిసి ఉండి స్నేహ భావంతో మెలగాలనేదే సారాంశం అన్నారు. అలాగే ముస్లిం సామాజిక వర్గంలో విద్య చాలా తక్కువ మందికి లభ్యమవుతుంది. అందుకే ప్రతి ఒక్కరు వారి పిల్లలకు ఖురాన్‌తోపాటు ఇంగ్లీష్ బోధన కూడా నేర్పించి, సమాజంలో లాయర్లుగా, వైద్యులు, ఇంజనీర్లుగా బాధ్యతలు చేపట్టే విధంగా ఉన్నత చదువులు చదివించేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని తెలిపారు. అలాగే ఐక్యత ఉంటే అభివృద్ధి సాధించవచ్చని, ఉదాహరణకు కుక్క మీద రాయివేస్తే పారిపోతుంది. అదే రాయి తేనేటీగల మీద విసిరితే తేనేటీగలన్నీ మన మీద దాడి చేస్తాయి, అప్పుడు మనం పారిపోయే పరిస్థితి ఉంటుంది. అంటే ప్రతి ముస్లిం సోదరుడు ఐకమత్యంగా ఉండి సమాజంలో సేవా కార్యక్రమాలు చేస్తూ అల్లా ప్రాముఖ్యత గురించి తెలుపుతూ ముందుకు సాగాలని తెలిపారు. జుమ్మా నమాజ్ నిర్వహించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కారెంపూడి: మండలంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కె.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్లలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. రాత్రి 12 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు ఇచ్చే త్రీఫేజ్ కరెంటు యథావిధిగా వస్తుందని, అయితే ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇచ్చే త్రీఫేజ్ కరెంటు సరఫరా వేళల్లో మార్పులు జరిగాయని, ఉదయం 7 గంటల నుంచి 9 వరకు ఆ తర్వాత మరమ్మతుల అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మరలా త్రీఫేజ్ సరఫరా ఉంటుందని వివరించారు.

అల్బెండజోల్ వేద్దాం.. నులిపురుగులను నివారిద్దాం



విద్యార్థికి అల్బెండజోల్ వేస్తున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



పెదకొదమగుండ్లలో విద్యార్థినికి మాత్ర వేస్తున్న డాక్టర్ లక్ష్మణరెడ్డి



వెల్దుర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో మాట్లాడుతున్న వైద్యులు బత్తిన శ్రీరామ్

రెంటచింతల: మండల పరిధిలోని గ్రామాలలో 19 సంవత్సరాలలోపు పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేసి నులిపురుగులను నివారిద్దామని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు ఆమె ఎంపీడీవో పి.శంకర్‌రావు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు నర్రా కృష్ణారెడ్డి, కె.ప్రదీప్‌కుమార్‌రెడ్డిలతో కలిసి అల్బెండజోల్ మాత్రలను వేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలలోని పాఠశాలల్లో చదువుతున్న పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను వేయడం ద్వారా పరిపూర్ణమైన ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. మండలంలోని మొత్తం 54 పాఠశాలల్లో చదువుతున్న 9,600 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేయడం లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్లు మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలు పిల్లలకు వేయడం వలన ఎటువంటి హాని ఉండదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పేర్ల చౌడమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్ల ముత్తయ్య, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

9,991 మందికి అల్బెండజోల్ మాత్రల పంపిణీ

కారెంపూడి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలో శుక్రవారం 9,991 మందికి నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను మండల వైద్య ఆరోగ్య శాఖ పంపిణీ చేసింది. కారెంపూడి పీహెచ్‌సీ పరిధిలో 33 పాఠశాలలు, 22 అంగన్‌వాడీ కేంద్రాలు, వివిధ గ్రామాలలో ప్రత్యేక క్యాంపుల ద్వారా మాత్రలను పంపిణీ చేశారు. ఎంపీపీ బొమ్మిన సావిత్రిఅల్లయ్య, జెడ్పీటీసీ షేక్ షఫీ, మండల పార్టీ అధ్యక్షుడు కొంగర సుబ్రమణ్యం, మండల యువజన విభాగం అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు వివిధ చోట్ల జరిగిన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే గాదెవారిపల్లె పీహెచ్‌సీ పరిధిలో 23 పాఠశాలలు, 26 అంగన్‌వాడీ కేంద్రాలు, వివిధ గ్రామాలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. పీహెచ్‌సీల డాక్టర్లు ఎం.రమ్య, డాక్టర్ ఎం.విజయానాయక్, డాక్టర్ ఎం.లక్ష్మణరెడ్డి పర్యవేక్షణలో సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు, ఆశా కార్యకర్తలు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కార్యక్రమ నిర్వహణలో పాల్గొన్నారు. దాదాపు 99 శాతం మందికి మాత్రలు వేయడం జరిగిందని మిగిలిన వారికి 16వ తేదీ వేయడం జరుగుతుందని డాక్టర్లు పేర్కొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు అందజేత

వెల్దుర్తి: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన వెల్దుర్తి జెడ్పీహెచ్ స్కూల్‌లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను అందించి మాట్లాడారు. రక్తహీనత నివారణ కొరకు బాల బాలికలకు అల్బెండజోల్ మాత్రలను అందించటం జరిగిందన్నారు. ఉప్పలపాడు పీహెచ్‌సీ పరిధిలో 19 సంవత్సరాలలోపు పిల్లలు 4,927 మందిలో 4787 మందికి అల్బెండజోల్ మాత్రలు అందజేశామన్నారు. మిగతా 140 మందికి 16వ తేదీన అందిస్తామన్నారు. ఎంపీడీవో డి.ప్రసాద్, ఎంఈవో కాంతారావు, హెచ్‌ఎం, వైఎస్సార్‌సీపీ నాయకుడ ఆదినారాయణ, ఎంఆర్‌పీ పురుషోత్తం, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

97 శాతం మందికి అల్బెండజోల్ మాత్రలు

మాచవరం: నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 97 శాతం మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి అన్వేష్ తెలిపారు. మండలంలో మొత్తం 9,581 విద్యార్థులకుగాను, 9,108 మందికి మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ఏసీగా సైదమ్మబాయి బాధ్యతల స్వీకారం



అసిస్టెంట్ కమిషనర్ సైదమ్మ

దుర్గి: పల్నాటి ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయానికి నూతన అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా పి.సైదమ్మబాయిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో స్థానిక ఈవోగా పనిచేస్తున్న శ్రీగిరిరాజు నరసింహబాబును బదిలీ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సైదమ్మబాయి మాట్లాడుతూ ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచనల మేరకు అభివృద్ధి చర్యలు చేపడతానని వివరించారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు, ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు అభినందనలు తెలిపారు.

కొత్తపుల్లారెడ్డిగూడెంలో సెబ్ దాడులు

1600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేసిన ఎస్‌ఈబీ పోలీసులు

వెల్దుర్తి: మాచర్ల అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు ఇంటెలిజెన్స్ సెబ్, నరసరావుపేట వారి ఆదేశాల మేరకు సెబ్ సీఐ కిషోర్ ఆధ్వర్యంలో మండలంలో కొత్తపుల్లారెడ్డిగూడెంలో 1600 లీటర్ల బెల్లం ఊటను శుక్రవారం ధ్వంసం చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు నాటుసారా తయారు చేసేందుకు డ్రమ్ములలో నిల్వ ఉంచిన బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో నాటుసారా తయారు చేసినా, అమ్మినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నాటుసారా తయారు చేసేవారిని ప్రోత్సహించినా కేసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామన్నారు. ఘటనా స్థలంలో నేరస్తుడు వదిలి వెళ్లిన వాహనాన్ని స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. గ్రామానికి చెందిన కేతావత్ వెంకటేశ్వరరావు నాయక్ నాటుసారా తయారు చేసేందుకు బెల్లం ఊటను తయారు చేస్తున్నాడన్నారు. వెంకటేశ్వరరావు నాయక్‌పై దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రామ్‌మోహన్‌రావు



ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్

రెంటచింతల: మండల తహసీల్దార్‌గా ఎస్.రామ్‌మోహన్‌రావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇప్పటి వరకు ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. ఆయనను పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ రెంటచింతల తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రామ్‌మోహన్‌రావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనల మేరకు స్థానిక అధికారుల సహకారంతో మండల ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ కట్టేకోట పుల్లారావును రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తిరుపతి జిల్లాకు బదిలీ చేస్తూ భూపరిపాలన చీఫ్ కమిషనర్ సాయి ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఎన్నికల సంఘం సూచనల మేరకు స్థానిక జిల్లాల నుంచి ఇతర జిల్లాలకు బదిలీల నేపథ్యంలో తహసీల్దార్ పుల్లారావును తిరుపతికి బదిలీ చేయగా గూడూరు డివిజన్ బాలయ్యపల్లి మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బ్రహ్మయ్య, ఆర్ఐ డి.కాంతారావు తదితరులున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో వేణుగోపాల్

మాచర్ల రూరల్: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దిటమే కాకుండా మంచి పౌష్టికాహారం, సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చిందని డిప్యూటీ డీఈవో కె.వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొప్పునూరు గ్రామ జెడ్పీ హైస్కూల్‌ను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. పేద విద్యార్థులకు అమ్మ ఒడి, పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం, ట్యాబులు, డిజిటల్ బోధన అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా శాతాన్ని పెంచేందుకు 10వ తరగతితో పాటు 3 నుంచి 9 వరకు ఒక్క గంట అదనంగా బోధన జరపాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడాలన్నారు. మధ్యాహ్న భోజనం అందరూ చేస్తున్నారా, రుచికరంగా ఉందా, బంగారు తల్లి ప్రోగ్రెస్ గురించి, హిమోగ్లోబిన్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్యానల్ మెంబర్స్ బాలనాగమ్మ, నజీర్, సిస్టర్ థామసమ్మ, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, అమర్, హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

విద్యార్థులు లక్ష్యం దిశగా రాణించాలి

వెల్దుర్తి: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మాచర్ల జెడ్పీటీసీ మండ్లి పెద్ద మల్లుస్వామి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని శిరిగిరిపాడులో గిరిజన ఆశ్రమ పాఠశాల వార్షిక వేడుకలలో పాల్గొని వారు మాట్లాడారు. ప్రతి విద్యార్థి లక్ష్యం ఏర్పరచుకొని, ఆ లక్ష్యం దిశగా కష్టపడి చదువుకొని రాణించాలన్నారు. విద్యార్థినులు అన్ని రంగాలలో రాణించాలన్నారు. పరీక్షలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మాచర్ల ప్రకాశరావు దంపతులు బహుమతులు అందజేశారు. అంతకుముందు పాఠశాల విద్యార్థినులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినుల నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పద్మ, కేర్ టేకర్ పోతురాజు, ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు లింగాల రాఘవాచారి, చపారపు లచ్చిరెడ్డి, నాగరాజు, తల్లిదండ్రులు, విద్యార్థినులు పాల్గొన్నారు.